# దైవసహన

**-ప్రతాప రవిశంకర్**

బస్సు ఆగిపోయింది. ముందు టైర్ పంక్చర్ అయిందని, డ్రైవర్ దాన్ని తీసి మరో టైరును వేసే ప్రయత్నం చేస్తున్నాడు. బస్సులో మనుషులంతా కిందకు దిగారు. కానీ దేవకి మాత్రం తన సీట్లోంచి కదల్లేదు. ఆమె వెనుక సీట్లో కూర్చున్న శివరావు అందరితోపాటు కిందకు దిగి కొంతసేపటికి మళ్లీ ఎక్కి తన సీట్లో కూర్చున్నాడు. దేవకి నిముష నిముషానికి చేతికివున్న వాచీని చూసుకోడం గమనించి ఆమె మొహంలో కదలాడుతున్న విచారాన్ని చూసి శివరావు ఆమెను పలకరించాడు.

తన తల్లికి ఆరోగ్యం బాగాలేదని, గుంటూరుకు దగ్గర్లో ఓ పల్లెటూరిలో వుంటున్న తల్లి ఇంటి పక్కవాళ్లు తనకు ఫోన్ చేసి వెంటనే రమ్మని చెప్పారనీ, వెంటనే తను తణుకు నుంచి బయల్దేరిందనీ గుంటూరులో తను వెళ్లవలసిన బస్సు దొరుకుతుందోలేదోనని ఆదుర్దా పడుతున్నట్లుగా చెప్పింది.

శివరావు ఏమీ మాట్లాడలేకపోయాడు. రిపేరు జరుగుతున్న ఆ బస్సు గుంటూరుకు ఎప్పుడు చేరుతుందో తెలీదు. ఇంకో గంటకు పైగా పట్టవచ్చు. ఇప్పుడే ఎనిమిదిన్నరకే వస్తోంది. అప్పటికి ఆ బస్సు వెళ్లిపోతుంది. రాత్రంతా దేవకి ఎక్కడ వుంటుంది? తనకు ఇంకా పెళ్లి కాలేదని, తణుకులో స్కూల్లో టీచరు ఉద్యోగం చేస్తూ ఒంటరిగా వుంటున్నట్లు చెప్పింది.

"గుంటూరులో మీకు తెలిసిన వాళ్లు ఎవ్వరైనా ఉన్నారా?'' అనడిగాడు శివరావు.

లేరని చెప్పింది దేవకి.

"ఆందోళన పడకండి. అంతా సవ్యంగానే జరుగుతుంది'' అన్నాడు శివరావు.

రిపేరు పూర్తయినట్టుంది. అంతా బస్సులోకి ఎక్కి కూర్చున్నారు.

డ్రైవర్ కూడా ఎక్కి స్టార్టు చేసి బస్సును ముందుకు పోనిచ్చాడు.

ఆలస్యమయిందని బస్సును ఎంత వేగంగా నడిపినా ఆ బస్సు గుంటూరు చేరేసరికి రాత్రి తొమ్మిదిన్నర దాటింది.

దేవకి వెనుకనే శివరావు కూడా బస్సు దిగి ఆమె వెళ్లవలసిన వూరికి వెళ్లే బస్సు గురించి ఎంక్వయిరీలో కనుక్కొని వచ్చాడు.

"సారీ... ఇరవై నిముషాల క్రితమే ఆ బస్సు వెళ్లిపోయిందిట'' అని చెప్పాడు దేవకితో.

అక్కడే ఉన్న ఇనుప బెంచీ మీద కూలబడి పోయింది దేవకి.

ఆమెను చూస్తే శివరావుకు జాలి కలిగింది. తనతో వచ్చి ఆ రాత్రికి తమ ఇంట్లో ఉండి ఫస్టు బస్సుకు వెళ్లమని చెప్పాలనుకున్నాడు. ఆమె ఒప్పుకుంటుందో లేదోనని ఆ ప్రయత్నాన్ని విరమించుకుని వెళ్లిపోయాడు.

"ఈ రాత్రికి నాకు ఈ బస్టాండులో జాగరణ తప్పదు'' అని దేవకి అనుకోవడం అతడికి వినిపించింది. శివరావు వుంటున్న ఇల్లు బస్టాండుకు దగ్గరే కాబట్టి అతను పది నిముషాల్లో ఇంటికి వెళ్లాడు. అతను వెళ్లేసరికి పిల్లలిద్దరూ నిద్రపోతున్నారు. అతడి భార్య సుమతి ఏదో వారపత్రికను చదువుతుంది హాల్లో కుర్చీలో కూర్చుని.

శివరావు లోపలకు వెళ్లడంతోనే దేవకి గురించి భార్య సుమతితో చెప్పాడు.

అప్పుడు సుమతి "పెళ్లికాని ఒంటరి ఆడపిల్లను బస్టాండులో వదిలి వచ్చారా? మనింటికి తీసుకురాలేకపోయారా?'' అంది.

"అనుకున్నానుగాని సుమతి... కానీ ఆ అమ్మాయికి నేనెవరో తెలీదు. కేవలం తోటి ప్రయాణికుడిని. ఆ అమ్మాయి నన్ను అపార్థం చేసుకుంటే?'' అన్నాడు.

"పోన్లెండి... ఇప్పుడు ఆ పనిని నేను చేస్తాను'' అని దేవకి గుర్తులను అడిగి తెలుసుకుని చెప్పులు వేసుకుని బయటకు వచ్చి గబగబా బస్టాండుకేసి నడిచింది సుమతి.

సుమతి వెళ్లేసరికి బ్యాగును వొళ్లో పెట్టుకుని శూన్యంలోకి చూస్తోంది దేవకి.

ఆమెను గుర్తించి దగ్గరకు వెళ్లి "దేవకి నువ్వే కదూ?'' అనడిగింది సుమతి.

"మీరెవరు?'' ఆశ్చర్యంగా అంది దేవకి.

"నువ్వు వచ్చిన బస్సులో నీ వెనకాల సీట్లో కూర్చున్న శివరావుగారు నా భర్త. ఆయన నీ గురించి చెప్పారు. నిన్ను మా ఇంటికి రమ్మని చెప్పాలని అనుకున్నారుట. కానీ నువ్వు ఆయన్ని అపార్థం చేసుకుంటావేమోనని ఇంటికి వచ్చి నాకు చెప్పారు. అందుకని నేను వచ్చాను. అవసరంలో వున్న ఒక మనిషికి ఆశ్రయం ఇవ్వడానికి బంధువులే అవసంలేదు. ఒంటరి ఆడదానివి ఒక రాత్రంతా ఈ బస్టాండులో కూర్చోవడం మంచిదికాదు. పద మా ఇంటికి వెళదాం. మా ఇల్లు ఇక్కడకు చాలా దగ్గరే. పదినిముషాల్లో వెళ్లవచ్చు. నిన్ను మీ అమ్మగారింటికి చేర్చే బాధ్యత నాది. సరేనా. పద ఇంటికి వెళదాం'' అన్నది సుమతి ఆమె చేయి పట్టుకుని.

సుమతి మాటల్లోని ఆప్యాయతకు దేవకి కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

తను కొంచం కూడా ఊహించలేదు. కానీ తను ఊహించనిది జరుగుతోంది. ఆమెకు తన వదిన గుర్తుకువచ్చింది.

లేచి నిల్చుని కన్నీళ్లు తుడుచుకుంటూ "ఈ రూపంలో వచ్చావా వదినా?'' అంది దేవకి.

"వదినేమిటి దేవకీ?'' అనడిగింది సుమతి ఆశ్చర్యపడి.

"చిన్నతనంలోనే మా నాన్న చనిపోయినందున మేము మా అన్నయ్య దగ్గర పెరిగాము. మా వదిన చాలా మంచిది. ఆమె నన్ను ఎంతో ప్రేమగా చూసుకునేది. కానీ ఎటువంటి ఇబ్బందీ కలగనిచ్చేదికాదు. ఇప్పుడు కూడా నేను బాధ పడుతున్నానని మా వదినే ఈ రూపంలో వచ్చిం

దని అనుకుంటున్నాను'' అన్నది దేవకి ఆమెతో కలసి బస్టాండు బయటకు నడుస్తూ.

"ఇప్పుడామె ఎక్కడ ఉంది?''

"ఈలోకంలో లేదు. మా అన్నయ్య పోయిన ఆరునెలలకు ఈమధ్యనే ఆమె కూడా చనిపోయింది'' చెప్పింది దేవకి.

మాట్లాడుకుంటూ ఇంట్లోకి వచ్చారు.

దేవకి కాళ్లు కడుక్కుని వచ్చాక సుమతి ముగ్గురికీ భోజనాలు వడ్డించింది.

"దేవకీ! నీకు చేసిన వాగ్దానాన్ని నిలుపుకుంటున్నాను. నీకు వదినే కాదు, నిన్ను ప్రేమగా పెంచిన మీ అన్నయ్యలాంటి ఇంకో అన్నయ్య ఇక్కడ ఉన్నాడు. ఆయనే శివరావుగారు. నువ్వు భోజనం చేసిన తరువాత నిన్ను మీ అమ్మగారింటికి బైక్‌మీద తీసుకువెళతారు'' అని చెప్పింది సుమతి.

"థాంక్స్ వదినా. ఇలా అనుకోని సంఘటనలు జరగడాన్ని ఏమంటారు?'' అంది దేవకి.

"దైవ ఘటన'' అన్నాడు శివరావు.

"కరెక్ట్'' అంది దేవకి.

"ఏమనుకున్నావు దేవకీ... శివరావుగారు గొప్ప రచయిత'' అన్నది సుమతి మెరుస్తున్న కళ్లతో గర్వంగా.

☆

